క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జి.కొండూరు: మండలంలోని వెల్లటూరులోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ స్థానిక సర్పంచ్ వేల్పూరి సుజానమ్మతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ముందుగా వెల్లటూరు శివారు గ్రామం సీతారాంపురంలో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ, వెల్లటూరు పడమర చెరువు రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.

అమ్మఒడి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

దొనబండ(ఇబ్రహీంపట్నం): ఈ నెల 28న ప్రభుత్వం మంజూరు చేయనున్న అమ్మఒడి పథకం నిధులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ–2 శ్యామ్‌రత్నబాబు అన్నారు. దొనబండలోని ఇందిరమ్మ కాలనీ ఎంపీపీ పాఠశాలలో మంగళవారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జగనన్న విద్యా కానుక అందజేశారు. గ్రామసర్పంచ్ డి.రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రంగస్వామి, పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, హెచ్‌ఎం అమర్‌నాయక్ పాల్గొన్నారు.

మునునూరు: దివ్యాంగ బాలలను అందరూ ఆదరించి, అక్కున చేర్చుకోవాలని ఎంఈఓ–2 సుబ్బారావు పేర్కొన్నారు. మునునూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో హెచ్‌ఎం హన్మామణి అధ్యక్షతన మంగళవారం దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించి, జ్ఞాన లోప బాలలకు ఉపకరణాలు, ఎంఆర్ కిట్స్ అందజేశారు.

కోతుల పట్టివేత

మైలవరం: మైలవరంలో విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతులను మంగళవారం పంచాయతీ అధికారులు పట్టించారు. కోతులు ఇళ్లలోకి ప్రవేశించి వంట గదుల్లో ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తున్నాయని గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో కూడా కోతుల వలన తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ప్రాంగణంలో డెన్‌లు ఏర్పాటు చేసి కోతులను పట్టుకున్నారు. వీటిని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ తెలిపారు. సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి పర్యవేక్షించారు.

వరి విత్తనాల పంపిణీ

కోకిలంపాడు(తిరువూరురూరల్): మండలంలోని కోకిలంపాడులో రైతులకు ఖరీఫ్ సీజన్లో విత్తనోత్పత్తి పథకం కింద వరి వంగడాలను ఎంపీపీ గద్దల భారతి మంగళవారం పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 25 ఎకరాలలో ఎంటీయూ10161 రకం వరి విత్తనాలు 7.5 క్వింటాళ్లను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు.

ఆర్థిక సాయం

మైలవరం: మైలవరానికి చెందిన ఓ పేద కుటుంబం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక లయన్స్ క్లబ్ వారు రూ.30వేలను ఆ కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శంకర్‌గుప్తా, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ నివృతరావు, పీఎంసీసీ మూల్పూరి ఉపేంద్రల ద్వారా నగదు అందజేశారు. లయన్స్ క్లబ్ మైలవరం అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బకించంద్ర చటర్జీకి నివాళి

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను ప్రాథమిక పాఠశాలలో మంగళవారం షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో వందేమాతరం రచయిత, కవి బకించంద్ర చటర్జీ జయంతి ఘనంగా నిర్వహించారు ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం నరసింహారావు పాల్గొన్నారు.

చేపల వేలం పాట

రెడ్డిగూడెం: మండలంలోని అన్నేరావుపేట పంచాయతీ పరిధిలో మంగళవారం పంచాయతీ చెరువుల చేపల వేలంపాట జరిగింది. ఊర చెరువు రూ.1.20లక్షలకు, కొప్పుల చెరువుకు రూ.1.17 లక్షలకు వేలం పాట ద్వారా విక్రయించారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మీరా, సర్పంచ్ ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శి వై.శివరంగారావు పాల్గొన్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

నూజివీడు: పట్టణంలో బుధవారం శ్రీశ్రీ జగన్నాథ రథయాత్ర నిర్వహణకు సన్నాహాలు పూర్తి చేసినట్టు మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ తెలిపారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో ఆయన మంగళవారం మాట్లాడారు. ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డు వద్ద శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఇస్కాన్ నిర్వహణలో శ్రీశ్రీ జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రథయాత్ర పోస్టర్ విడుదల చేశారు.

మహిళలకు కౌన్సెలింగ్

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని శోభనాపురం అడ్డరోడ్డు వద్ద అశ్లీల సైగలు చేస్తున్న ఆరుగురు మహిళలను మంగళవారం ఎస్సై నంబూరి చంటిబాబు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని నూజివీడు కోర్టులో హాజరుపరిచేందుకు సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. ఆగిరిపల్లికి చెందిన ఇరువురు మహిళలను కోర్టులో హాజరు పరచగా వారికి అపరాధ రుసుం విధించారు. మండల మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేసి రూ.లక్ష పూచికత్తుపై విడుదల చేసినట్టు ఎస్సై తెలిపారు.

జోరుగా జగనన్న ఇళ్ల నిర్మాణం

- 28.97 ఎకరాల్లో లేఅవుట్ల అభివృద్ధి
- రెండు వేల కుటుంబాలకు లబ్ధి



పీటీ కొత్తూరులో పేదలు నిర్మించుకుంటున్న పక్కాగృహాలు

తిరువూరు: దీర్ఘకాలంగా తిరువూరు పట్టణ పేదలు ఎదుర్కొంటున్న సొంతింటి సమస్య తీరుతోంది. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పట్టణ గృహ నిర్మాణ పథకం కింద పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయడంతో పాటు పక్కా గృహాలను కేటాయించడంతో సుమారు రెండు వేల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. పట్టణ పరిధిలోని పీటీ కొత్తూరులో ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి పేదలకు నివేశన స్థలాలను పంపిణీ చేసింది. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసే సొమ్ముతో పాటు డ్వాక్రా మహిళలకు రుణ సదుపాయం, బ్యాంకు ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సాయం చేస్తుండటంతో ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది.

లేఅవుట్లలో సకల సదుపాయాలు

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సదుపాయం, అంతర్గత రహదారుల నిర్మాణం, విద్యుత్ సదుపాయం కల్పించారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం జరిపే వరకు తాత్కాలికంగా సింథటిక్ ట్యాంకులను ప్రతి 10 ఇళ్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసి మోటార్లతో నీరందిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం జరుపుకునే వారికి ఇసుక లేఅవుట్లలోనే డంపింగ్ చేసి, సిమెంటు, ఇనుము గోదాము నుంచి నేరుగా ప్లాట్ వద్దకు తరలించే ఏర్పాటు చేశారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, వార్డు వలంటీర్లు సంయుక్తంగా ప్రతి లబ్ధిదారుడూ ఇల్లు నిర్మించుకునే విధంగా ప్రోత్సహిస్తూ త్వరితగతిన లక్ష్యం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారు.

లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం

ఇళ్లు మంజూరైన వారు త్వరితగతిన నిర్మించుకోవాలని ప్రోత్సహిస్తున్నాం. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సంయుక్తంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించేందుకు కృషి జరుగుతోంది.

– భాస్కరరాజు, అసిస్టెంట్ ఇంజినీర్, హౌసింగ్, తిరువూరు

జగనన్న కాలనీల్లో ప్లాట్ల కేటాయింపు ఇలా..

సర్వే నెం.	విస్తీర్ణం(ఎకరాల్లో)	మొత్తం ప్లాట్లు	ప్రారంభించిన ఇళ్లు
202/1ఎ	3.12	134	91
305/1	7.35	246	126
298/2పీ	12.8	529	326
235/2బీ1ఎ	5.7	266	132
మొత్తం	28.97	1,175	675

మా కల నెరవేరింది



30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో, చాలీచాలని గదుల్లో కాలక్షేపం చేశాం. సొంతిల్లు నిర్మించుకునే అవకాశం ఎప్పుడొస్తుందోనని ఎదురు చూశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో మాకు పీటీ కొత్తూరు జగనన్న కాలనీలో ఇల్లు సమకూరింది. మా సొంతింటి కల నెరవేరింది.

– ముచ్చింతల నాగలక్ష్మి, గృహ లబ్ధిదారు, తిరువూరు

పేదల దేవుడు జగన్



గత ప్రభుత్వాలలో కేవలం ప్రకటనలకే పరిమితమైన పక్కా గృహాల మంజూరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి నవరత్నాలతో నెరవేరింది. మా పేదల పాలిట పెన్నిధి ముఖ్యమంత్రి జగన్. నివాసయోగ్యంగా కాలనీలను తీర్చిదిద్దుతున్నందుకు కృతజ్ఞతలు.

– ఎం.వెంకటేశ్వరరావు, తిరువూరు

ఆనందంగా ఉంది



జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం ఇవ్వడంతో పాటు పక్కాగృహం మంజూరు చేయడంతో మాకు సొంతిల్లు నిర్మించునే అవకాశం కలిగింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో మావంటి పేదలకు పక్కాగృహం సమకూరింది. గృహనిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయంతో మావంటి పేదలకు లబ్ధి చేకూరుతోంది.

–రహీదాబేగం, లబ్ధిదారు, తిరువూరు

సీఎం జగన్‌తోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ముస్లిం మైనార్టీల అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. కొండపల్లిలో పలు మసీదులను ఆయన మంగళవారం సందర్శించి ముస్లిం పెద్దలతో చర్చించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంతకు అండగా ఉండాలన్నారు. ముస్లిం పెద్దలు ఎండీ వాహెద్, షేక్ బడేమియా పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులు సమాజ సేవకులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): నర్సింగ్ విద్యార్థులు నిస్వార్థ సమాజ సేవకులని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. నిమ్రా నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ క్యాడెట్‌లు దీపం వెలిగించే వేడుకల్లో ఆ విద్యాసంస్థల డైరెక్టర్ షాదిల్ రసూల్‌ఖాన్‌తో కలిసి ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఆధునిక నర్సింగ్‌కు మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళిగా దీపాలు వెలిగించారు. అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ గులాంగౌస్, వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ బాబులాల్, శ్యామలదేవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

జీకొత్తూరు(తిరువూరురూరల్): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని జీకొత్తూరులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదరిక నిర్మూలన, సామాజిక ప్రగతి లక్ష్యంగా కూడా ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందన్నారు. జీకొత్తూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలు నూరుశాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రయోజనం పొందారన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతి గ్రామంలో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, సర్పంచ్ వెంకటరావమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాధమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారెడ్డి, ఏసురత్నం పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'లో సేవలు తెలియజేయండి

సబ్‌కలెక్టర్ అదితిసింగ్



రాయనపాడులో 'జగనన్న సురక్ష'ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అదితిసింగ్

రాయనపాడు(విజయవాడరూరల్): జగనన్న సురక్ష కార్యక్రమంలో లభించే సేవలను ప్రజలకు వివరించాలని విజయవాడ సబ్‌కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. మండలంలోని రాయనపాడులో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. విజయవాడ రూరల్ తహసీల్దారు పి.జాహ్నవిరెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న సురక్ష

చాట్రాయి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. చాట్రాయి మండలం చనుబండ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంట్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు తన పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని, అర్హులకు పథకాలు వర్తించేలా యాప్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ విశ్వనాథరావు సూచించారు. ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, ఈఓపీఆర్‌డీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరావు, వెంకటేశ్వరావు, చినబాబు, వాసు, శివకుమార్ రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే తనిఖీ

మునునూరు: జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆ పథక మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. మండలంలోని సూరేపల్లి, లోపూడి గ్రామాల్లో తహసీల్దార్ దాసరి సుధ, ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన రెండు టీముల అధికారులు, గ్రామ, మండల ప్రజా ప్రతినిధుల సమక్షంలో వలంటీర్లు జగనన్న సురక్ష సర్వేను మంగళవారం కొనసాగించారు. సూరేపల్లిలో సర్వేను ఆయన తనిఖీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు, డీటీ ఎమిలీ కుమారి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

4న చంద్రాలలో జగనన్న సురక్ష కార్యక్రమం

చంద్రాల(మైలవరం): మైలవరం మండలం చంద్రాల గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జూలై నాల్గో తేదీన నిర్వహించనున్నట్లు సచివాలయ కన్వీనర్ నాగరాజు యాదవ్ మంగళవారం తెలిపారు. చంద్రాల, టీ గన్నవరం గ్రామాల ప్రజలు ఎవరైనా అర్హత ఉండి పథకాలు అందని వారు కులధ్రువీకరణ, ఆధార్ కార్డు మార్పులు, చేర్పులు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు

తిరువూరు: విద్యాశాఖ ఆదేశాల మేరకు తిరువూరు మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, విద్యార్థులకు అందుతున్న ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ నెల 28వ తేదీన అమ్మ ఒడి నిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేస్తారని, ఇప్పటికే జగనన్న విద్యాకానుక కింద కిట్లను సరఫరా చేశామని హెచ్‌ఎంలు తెలిపారు.

మునునూరు: గ్రామాల్లోని బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు తల్లిదండ్రుల సహకారం అవసరమని మునునూరు హైస్కూల్ హెచ్‌ఎం ఎ.సునీల పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ రజని పాల్గొన్నారు.

గంపలగూడెం: విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ఎంఈఓ పి.నరసింహారావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పీఎంసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం కిరణ్ పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌కు మెప్మా సిబ్బంది కృతజ్ఞతలు



మంత్రి రమేష్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీలో మెప్మా మహిళా సిబ్బంది సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం మంత్రిని కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి జోగి రమేష్ ఉన్న చిత్రపటాన్ని బహూకరించారు. సెర్ప్ సంస్థలో పనిచేసిన మహిళలు కొండపల్లి మున్సిపాల్టీగా మారిన నేపథ్యంలో మెప్మా సిబ్బందిగా పరిగణించారు. సాంకేతిక కారణాలతో తొమ్మిది నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో ఇటీవల మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన మెప్మా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించి, పాత వేతన బకాయిలు విడుదల చేయించారు.

విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నాయకుల ప్రోత్సాహకాలు



మౌనికకు బహుమతిని అందజేస్తున్న నాయకులు

జి.కొండూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించడంతో పాటు పాఠశాలకు స్పోర్ట్స్ కిట్ల నిమిత్తం కవులూరు వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. కవులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ప్రతిభచాటి మండలంలో ప్రథమస్థానంలో నిలిచిన మౌనికకు జెడ్పీటీసీ సభ్యుడు జక్రధరరావు తన సొంత నిధుల నుంచి రూ.5వేలు అందజేశారు. కవులూరు గ్రామ వైఎస్సార్ సీపీ నుంచి మౌనికకు రూ.5వేలు, రెండో బహుమతిగా కొమరవల్లి అఖిల్‌కు రూ.3వేలు, మూడో బహుమతిగా ఆశ్రితకు రూ.2వేలతో పాటు పాఠశాలకు స్పోర్ట్స్ కిట్ కోసం రూ.20 వేలను సర్పంచ్ కొండా మరియమ్మ అందజేశారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

రెడ్డిగూడెం: కౌలు రైతులు పంట వేసిన వెంటనే ఈ–క్రాప్ బుకింగ్(పంట నమోదు) నమోదు చేసుకోవాలని, పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు కూడా పంట సాగుదారు హక్కు పత్రం ముఖ్యమైందని వ్యవసాయశాఖ అధికారి సురేష్ అన్నారు. నాగులూరులో కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారి నాగజ్యోతి, ఉద్యాన సహాయకుడు శేషు పాల్గొన్నారు.

కౌలు కార్డు ఉంటేనే ఈ–క్రాప్ నమోదు

వెల్వడం(మైలవరం): కౌలుదారులకు కౌలు కార్డు ఉంటేనే ఖరీఫ్ 2023–24 ఈ–క్రాప్ పంట నమోదు చేయనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు తోట తిరుపతి రావు తెలిపారు. మైలవరం మండలం వెల్వడం రైతు భరోసా కేంద్రంలో పంట సాగుదారు హక్కు పత్రంపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. సర్పంచ్ ధర్మరాజు, గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రాయితీ పొందాలంటే కార్డులు తప్పనిసరి

జి.కొండూరు: ప్రభుత్వం అందించే రాయితీలు నేరుగా కౌలురైతు పొందాలంటే పంటసాగుదారు హక్కు పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ రోహిణీదేవి అన్నారు. కవులూరు పంచాయతీ కార్యాలయంలో కౌలురైతు కార్డులపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. సర్పంచ్ మరియమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు సాంబశివరావు, ఏఓ రాంకుమార్, వీఆర్‌ఓ నాగులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఏ.కొండూరు: కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి టిప్పు సుల్తాన్ పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామ సచివాలయంలో మంగళవారం కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ రామచంద్రరావు, వీఆర్వో వి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

ఏ.కొండూరు: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి–2 ఈఎల్‌సీ కేశవరావు పేర్కొన్నారు. మండలంలోని పోలిశెట్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న అమ్మ ఒడి పథకంపై విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు జి. రామయ్య, డి వెంకటేశ్వరరావు, బి.సూర్య, ఖలీల్ బాషా పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

మొర్సుమల్లి(మైలవరం): నాణ్యమైన విత్తనాలు మాత్రమే సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ షాపులలో విక్రయించాలని విజయవాడ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బీ వెంకటేశ్వరరావు షాపుల యజమానులకు సూచించారు. మైలవరం మండలం పుల్లూరు, మైలవరం, మొర్సుమల్లి గ్రామాలలోని విత్తన విక్రయ షాపులను వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వరరావు మండల వ్యవసాయ శాఖ అధికారి కే సంధ్యారాణితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు.

నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ స్థాయి కంపెనీలతో పోటీ పడగల నైపుణ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఏఐ అండ్ డీఎస్, ఈఈఈ విభాగాలలో నాలుగో సంవత్సరం విద్యార్థులకు బెంగళూరు విప్రో సహకారంతో కళాశాల విప్రో సర్టిఫైడ్ అధ్యాపకుల ద్వారా విప్రో టాలెంట్ నెక్స్ట్ ట్రైనింగ్ ఆన్ జావా ఫుల్‌స్టాక్ అనే అంశంపై నిర్వహించిన శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణలో నైపుణ్యం చూపించిన విద్యార్థులకు విప్రో కంపెనీ ద్వారా కోర్స్ కంప్లీషన్ సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

అధికార భాష అమలుకు కృషి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ప్రభుత్వం సంస్థల్లో పని చేసే ఉద్యోగులు అధికార భాష అమలుకు కృషి చేయాలని రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. వ్యాగన్ వర్క్‌షాపులో అధికార హిందీ భాషపై త్రైమాసిక సమావేశం మంగళవారం జరిగింది. డిప్యూటీ చీఫ్ మెటీరియల్ మేనేజర్ హేమరాజ్ మీనా, అనువాదకులు రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని కార్మికులకు ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యశాలల వైద్యులు 200 మందికి మధుమేహం, బీపీ, ఈసీజీ, ఎకో, కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

సొసైటీ సేవలను వినియోగించుకోవాలి

గంపలగూడెం: రైతులు తమ అవసరాలకు కావాల్సిన రుణాల్ని సొసైటీల ద్వారా పొంది వడ్డీ భారం కాకుండా చూసుకోవాలని గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చిన్నకొమిర సొసైటీలో ఈ ఏడాది మెంబర్ స్థాయిలో నూరుశాతం రుణాలు వసూలు కావడంపై సిబ్బంది, పాలకవర్గ సభ్యులకు ఆయన మంగళవారం సొసైటీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందుకోసం కృషి చేసిన పర్యవేక్షణాధికారి, బ్యాంక్ సూపర్‌వైజర్ మల్లాది ఏసోబు, సీఈఓ సుగ్గల కృష్ణను అభినందించారు. సొసైటీ చైర్మన్ గువ్వల సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ వైకుంఠం, శ్రీనివాసరావుకు ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. మేనేజర్ కంచర్ల కనకదుర్గ, సూపర్‌వైజర్ మల్లాది ఏసోబు, సీఈఓ సుగ్గల కృష్ణ పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి బోనాలు

చాట్రాయి: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని చనుబండ ఎల్లమ్మ తల్లికి మంగళవారం భక్తులు బోనాలు సమర్పించుకున్నారు. మహిళలు తలపై బోనాలు పెట్టుకుని బ్యాండు మేళాలతో గ్రామంలో ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

గృహ నిర్మాణాల పరిశీలన

చాట్రాయి: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను వేగవంతంగా నిర్మించుకోవాలని తహసీల్దార్ విశ్వనాథరావు అన్నారు. మండలంలోని చనుబండ గ్రామంలో జగనన్న లే అవుట్లో నిర్మిస్తున్న గృహాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరావు, వంకిణి వెంకటేశ్వరావు, వాసు, చినబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జి.కొండూరు: ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని మైలవం ఏసీపీ మార్గాని రమేష్ అన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జి.కొండూరు పోలీసుస్టేషన్ ప్రాంగణంలో లారీడ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్సై ధర్మరాజు పాల్గొన్నారు.